క్లుప్తంగా

రైతుల వివరాలపై విచారణ



రాచపల్లిలో విచారణలో పాల్గొన్న ఆర్డీవో, తహసీల్దార్

మాకవరపాలెం: రెవెన్యూ రికార్డుల ఆధారంగా రైతుల వివరాలపై సర్వే చేస్తున్నట్టు నర్సీపట్నం ఆర్డీవో జయరాం తెలిపారు. డివిజన్ పరిధిలోని మాకవరపాలెం మండలం రాచపల్లి రెవెన్యూ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో శనివారం రాచపల్లిలో చేపట్టిన రైతుల వివరాలపై సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రెవెన్యూ గ్రామంలో మొత్తం 2814 మంది రైతులు ఉన్నారన్నారు. వీరిలో ప్రథమంగా 91 మంది వివరాలు ఆన్‌లైన్‌లో వచ్చాయన్నారు. వీరిపై విచారణ చేపట్టి జీవించి ఉన్న వారితో వేలిముద్ర వేయించడంతోపాటు మరణించిన వారి వివరాలను వీఆర్వో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. జాబితా ప్రకారం 2,814 మంది వివరాలపైనా విచారణ చేస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ జెట్టి, వీఆర్వో సింహాద్రి ఉన్నారు.

దోమల నివారణకు మందు పిచికారీ



దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

దేవరాపల్లి: వాలాబు పంచాయతీ శివారు గిరిజన గ్రామం కోడాపల్లిలో దేవరాపల్లి పీహెచ్‌సీ సిబ్బంది శనివారం దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. వైద్యాధికారి ఎస్. లలిత ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని హెల్త్ అసిస్టెంట్ గోవింద్ తెలిపారు. ఇక్కడ నెల రోజుల క్రితం మలేరియా కేసు నమోదు కావడంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రతీ ఇంటికి వెళ్లి దోమల నివారణకు మందు పిచికారి చేశామని ఏఎన్ఎం వి. విజయ తెలిపారు. లార్వా వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక గిరిజనులకు అవగాహన కల్పించారు.

ఎం. కోటపాడు మాజీ ఎంపీటీసీ మృతికి సంతాపం



శ్రీరామమూర్తి(ఫైల్)

మాడుగుల రూరల్: ఎం. కోటపాడు మాజీ ఎంపీటీసీ సభ్యుడు, విశ్రాంత వీఆర్వో బొడ్డపాటి శ్రీరామమూర్తి(72) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా, కాంగ్రెసు పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా, విశాఖ డైయిరీ డైరెక్టరుగా పనిచేశారు. చీడికాడ, మాడుగుల మండలాల్లో వీఆర్వోగా పనిచేశారు. ఆయన భార్య గతంలో మృతి చెందగా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఫోన్లో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. శనివారం ఆయన మృతదేహం వద్ద వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, వీఆర్వోల సంఘం నాయకుడు ఈర్లె శ్రీరామమూర్తి, బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ దొండా రాంబాబు, వివిధ పార్టీల నాయకులు పుప్పాల అప్పలరాజు, దంగేటి సూర్యారావు, పడాల కొండలరావు, బొమ్మిశెట్టి శ్రీను సందర్శించి నివాళులర్పించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



నీమాస్త్రం తయారీ చేస్తున్న దృశ్యం

గొలుగొండ: ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఐసీఆర్పీ మోడల్ మేకర్ రామకృష్ణ, పార్వతి, అమ్మాజీ తెలిపారు. శనివారం కొత్త ఎల్లవరంలో రసం పీల్చే పురుగుల నివారణకు ఆవుపేడ, వేప ఆకులతో నీమాస్త్రం తయారీ విధానం రైతులకు అవగాహన కల్పించారు. ఈ కషాయం వినియోగంతో ఖర్చు తగ్గుతుందని, పంటకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ప్రతీ గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పత్తి, కూరగాయల సాగుపై కృత్రిమ రసాయనం చాలా బాగా పనిచేస్తుందని రైతులు తెలిపారు.

ముమ్మరంగా ఖరీఫ్ పనులు

- పొలం పనుల్లో తీరిక లేని రైతులు
- నమ్ముగా కురుస్తున్న వర్షాలు
- జోరుగా వరినాట్లు



బుచ్చెయ్యపేటలో పొలం దమ్ము పడుతున్న ట్రాక్టరు



వరి ఆకు తీస్తున్న కూలీలు

బుచ్చెయ్యపేట: మండలంలో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురవడం చెరువులు, బావులు నీటితో కళకళలాడుతున్నాయి. వీటి ఆయకట్టు రైతులు పొలం పనుల్లో బిజీబిజీగా మారారు. దమ్ముతోపాటు నేల చదును చేసి ఆకు తీసి వరినాట్లు వేయడంలో క్షణం తీరిక లేకుండా ఉంటున్నారు. మరోవైపు కూలీలతో జోరుగా వరినాట్ల పనులు సాగుతున్నాయి.

మండలంలోని 35 పంచాయతీ గ్రామాల్లో 6,400 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో వరి నాట్లు వేయడానికి రైతులు సిద్ధమయ్యారు. బుచ్చెయ్యపేట, వడ్డాది మేజర్ పంచాయతీతోపాటు గంటికొర్లాం, పొట్టిదొరపాలెం, లోపూడి, బంగారుమెట్ట, ఎల్.బి.పురం, విజయరామరాజుపేట, రాజాం, సీతయ్యపేట, గున్నెంపూడి, పెదమదీన, కరక తదితర గ్రామాల్లో ఖరీఫ్ పొలం పనులు జరుగుతున్నాయి. మెరక, పల్లపు ప్రాంతాల్లో రైతులు దమ్ములు చేసి వరినాట్లు వేస్తున్నారు. ఎకరాకు 10 నుంచి 16 మంది కూలీలతో వరినాట్లు వేయగా స్వర్ణ, ఆర్‌జీఎల్, సాంబమసూరి, సోనామసూరి, అమరావతి తదితర రకాల వరినాట్లు వేస్తున్నారు. ప్రభుత్వం రాయితీ విత్తనాలు, ఎరువులతోపాటు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నగదు అందించడంతో పలు గ్రామాల్లో రైతులు సంతోషంతో ఖరీఫ్ పనులు చేస్తున్నారు. ఎకరాకు 30 నుంచి 50 బస్తాల ధాన్యం దిగుబడి సాధించేలా వ్యవసాయశాఖ, శాస్త్రవేత్తల సూచనలు,సలహాలు పాటిస్తూ ఆధునిక పద్ధతులు పాటిస్తున్నారు. కొంతమంది రైతులకు కూలీలు దొరక్కపోవడంతో పక్క గ్రామాల నుంచి తీసుకొచ్చి పొలం పనులు చేస్తున్నారు. వచ్చే నెలాఖరు వరకు ఖరీఫ్ వరినాట్లు వేయడానికి అనుకూలంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి భాస్కరరావు తెలిపారు.



పొలాల్లో వరినాట్లు వేస్తున్న కూలీలు

పుష్కలంగా సాగునీరు..

గతంలో ఎన్నడూ లేని విధంగా తుపాను వర్షాలు కురవడంతో మండలంలో ఈ నెలలోనే 170 మిల్లీ మీటర్ల వరకు వర్షపాతం నమోదైంది. నదులు, వ్యవసాయ బావులు వర్షం నీటితో నిండుకుండలా తొణికిలాడుతున్నాయి. కాలువలు, గెడ్డల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. పొలాలకు సాగునీరు పుష్కలంగా అందుతోంది.

రోడ్డు విస్తరణ ఆగే ప్రసక్తే లేదు

- ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియ ప్రారంభం
- గడపగడపలో ఎమ్మెల్యే గణేష్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పట్టణంలో మెయిన్ రోడ్డు విస్తరణపై అపోహలు వద్దు.. జరిగి తీరుతుందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ స్పష్టం చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ 24వ వార్డు శివపురంలో శనివారం ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోర్టు సూచనల మేరకు రోడ్డు విస్తరణకు ముందుకు వెళ్తున్నామన్నారు. రోడ్డు విస్తరణకు సంబంధించి ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. టీడీఆర్ బాండ్లకు అంగీకరిస్తే రోడ్డు విస్తరణ చేయాలని కోర్టు సూచించింది, లేదంటే భూసేకరణకు వెళ్లాలని ఆదేశించింది, కోర్టు ఆదేశాలను గౌరవిస్తూ రోడ్డు విస్తరణకు ముందుకు వెళ్తున్నామన్నారు. ఇప్పటికే 90 మంది భవన యజమానులు రోడ్డు విస్తరణకు ముందుకొచ్చారన్నారు. భవన యజమానుల అభ్యర్థనను పరిగణలోకి తీసుకుని మిగిలిన వారిని స్వయంగా కలిసి మద్దతు కూడగట్టి రోడ్డు విస్తరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందరికీ సహకారంతో రోడ్డు విస్తరణ చేపడతామన్నారు. మున్సిపాలిటీలో 15 గ్రామ సచివాలయాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిందన్నారు. ఈ సచివాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ వారంలో పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కమిషనర్ కనకారావు, తహసీల్దార్ అన్నాజీరావు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకులు ఏకా రాజుబాబు, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, బయపురెడ్డి చినబాబు, సిరసపల్లి నాని, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషాబేగం, కర్రి శ్రీనివాసరావు, టౌన్ మహిళా అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ మళ్ల గణేష్, కోఆప్షన్ సభ్యుడు లగుడు స్వామి, పార్టీ నాయకులు గంటా లలిత, దేవత అరుణ, వరలక్ష్మి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వీవోఏల సర్క్యులర్ రద్దు చేయాలని వినతి



మాట్లాడుతున్న సంఘ జిల్లా అధ్యక్షుడు సూరిబాబు

కె.కోటపాడు: వెలుగు పథకంలో పని చేస్తున్న వీవోఏలకు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సూరిబాబు అన్నారు. చౌడువాడలో శనివారం కె.కోటపాడు, సబ్బవరం, దేవరాపల్లి, పరవాడ మండలాల వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కోటపాడు మండల వీవోఏల సంఘం అధ్యక్షుడు ఎం.నాగభూషణంతో కలిసి మాట్లాడుతూ ప్రస్తుతం పని చేస్తున్న వీవోఏలకు వయోపరిమితి లేకుండా విధులను కొనసాగించాలన్నారు. గ్రామాల్లో ఈ విధుల నిర్వహణకు జెండర్ విధానం వర్తించకుండా చర్యలు చేపట్టాలన్నారు. వీరిపై అధికారుల ఒత్తిడి లేకుండా ఉండడంతోపాటు పని భారం కాకుండా చూడాలన్నారు. వీవోఏలకు శాఖాపరంగా ఇన్సూరెన్స్ వర్తించేలా చర్యలను తీసుకోవాలని తెలిపారు. వీవోఏల సంఘం జిల్లా కోశాధికారి లక్ష్మీప్రసన్న, వీవోఏలు శాంతి, సత్యం, లక్ష్మి, భవాని, రమణ పాల్గొన్నారు.

సంఘ భవన నిర్మాణానికి సహకరించండి

- సలహాదారు గైరమ్మ సత్యం



సంఘ భవనం గురించి అభిప్రాయాల సేకరణలో పాల్గొన్న సభ్యులు, అభిమానులు

రోలుగుంట: స్థానికంగా ఎంతో ప్రతిష్ట ఉన్న జీవకారుణ్య సంఘం పునర్నిర్మాణానికి కలిసికట్టుగా సహకరించాలని నిర్మాణ సలహాదారు గైరమ్మ సత్యం కోరారు. శుక్రవారం రాత్రి పూర్వపు సంఘ సభ్యులు, అనుబంధంగా ఉన్న సిద్ధి వినియక నూతన కమిటీ, అభిమానులతో సమావేశం నిర్వహించారు. వీరిలో నిర్మాణ బృందం అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతిని కలిసి వినతిపత్రం ఇవ్వగా రూ.5 లక్షలు మంజూరు చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సూచనతో జెడ్పీటీసీ తన నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధుల ప్రాప్తికి తమరాన సతీష్, మాకిరెడ్డి శ్రీను, తదితరులు పీఆర్ జేఈ ఉమామహేశ్వరుడి ప్లాన్ మేరకు 15 రోజులుగా భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. దీనిని శరవేగంగా పూర్తి చేసేందుకు శుక్రవారం రాత్రి సమావేశమయ్యారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, ఖర్చు సభకు సతీష్ వినిపిస్తున్న సమయంలో సంఘ సభ్యులు విమర్శలకు దిగారు. దాంతో సంఘ అభివృద్ధి, నిర్మాణ సలహాదారుడైన గైరమ్మ సత్యం వారించి, ఎంపీ, జెడ్పీటీసీ పెద్ద మనస్సుతో నిధులు మంజూరు చేశారని, వారికి కృతజ్ఞులమై ఉండి ఐకమత్యంతో భవణ నిర్మాణాన్ని పూర్తి చేసుకుని, సంఘం ప్రతిష్ట నిలుపుకోవాలని సూచించారు.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం

- ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి
- ఉమ్మడి జిల్లా పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో రూ.75 వేల సాయం



ఆప్కో చైర్మన్‌తో కలిసి బాధితులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

నాతవరం: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చేనేత కార్మికుల కుటుంబాలను పద్మశాలి సంఘం సభ్యులు ఆదుకోవడం ఆనందాయకమని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. ఇటీవల గునుపూడిలో మూడు పూరిళ్లు పూర్తిగా కాలిపోయాయి. బాధిత కుటుంబ సభ్యులను ఉమ్మడి జిల్లాకు చెందిన పద్మశాలి సంఘం సభ్యులతో కలిసి శనివారం ఆయన పరామర్శించారు. ఉమ్మడి జిల్లా అఖిల భారత్ పద్మశాలి సేవా సంఘం, పద్మశాలి ఇంటర్నేషనల్ సొసైటీ సేవా సంఘం సంయుక్తంగా బాధిత కుటుంబాలు పసగడుగుల కన్నబాబు, పి.నాగరాజు, పలకా అచ్చియ్యమ్మలకు రూ.75 వేల సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చైర్మన్ మాట్లాడుతూ ఆప్కో ద్వారా ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలను ఆదుకుంటామన్నారు. వీరికి స్థలాలు ఉన్నందుకు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌తో మాట్లాడి యుద్ధప్రాతిపదికన ఇల్లు మంజూరు చేయిస్తానన్నారు. రాజకీయాలతో పని లేకుండా అన్ని వర్గాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదుకుంటున్నారన్నారు. చేనేత కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చిన రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి వారికి మనోధైర్యం కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించే సాయంతోపాటు పద్మశాలి సంఘం సహకారం అందిస్తే మరింత అభివృద్ధి చెందుతారన్నారు. ఉత్తరాంధ్రలో పద్మశాలి సేవా సంఘం సభ్యులు విద్య, వైద్యంతోపాటు అనేక రంగాల్లో అందించే సేవలు మరింత పెంచాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించే సదుపాయాలు దృష్టిలో పెట్టుకుని ప్రతి చేనేత కుటుంబాలకు చెందిన పిల్లలను చదివించాలన్నారు. సర్పంచ్ వేముల సూర్యనారాయణ మాజీ ఎంపీటీసీ వేముల సూరిబాబు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బోసి పరదేశి, సింహాచలం దేవస్థానం బోర్డు మాజీ డైరెక్టరు సూరిశెట్టి సూరిబాబు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యురాలు కొప్పుల ప్రభావతి, అఖిల భారత్ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు రాపర్తి సుబ్బారావు, కార్యదర్శి దుర్గాప్రసాద్, కోశాధికారి ఆనందరావు, నర్సీపట్నం డివిజన్ సంఘం అధ్యక్షుడు సూరిబాబు, నాయకులు కోసూరి రామకృష్ణ, కొప్పుల ఈశ్వర్, రమేష్ పాల్గొన్నారు.

భైక్ రైడింగ్‌లో జాగ్రత్తలు అవసరం

ఎస్.రాయవరం: బైకు నడిపేవారు, యువత విధిగా జాగ్రత్తలు పాటించాలని నక్కపల్లి సీఐ అప్పన్న అన్నారు. బైకు రైడింగ్‌పై అవగాహన కల్పించేందుకు కాకినాడకు చెందిన యువకులు కాకినాడ నుంచి విశాఖపట్నం వరకు ర్యాలీ చేపట్టారు. వారికి సీఐ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత అవగాహన లేకుండా, హెల్మెట్లు లేకుండా బైకులు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. బైకు రైడింగ్‌పై అవగాహన కల్పించేందుకు కాకినాడ నుంచి విశాఖపట్నం వరకు రైడింగ్‌లో పాల్గొన్న, హవాక్ రైడర్స్ క్లబ్ యువకులను సీఐ అభినందించారు. మరింత మంది యువకులు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

108 వాహనాల పనితీరుపై ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న డీఎం త్రినాథరావు

రావికమతం: మండలంలో 108 వాహనాల పనితీరును ఉమ్మడి విశాఖ జిల్లా డీఎం త్రినాథరావు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. 108 వాహనంలో పరికరాలు ఏవిధంగా పనిచేస్తున్నాయి, వాటి విధి విధానాలు, తీరు తెన్నులను పరిశీలించారు. సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. కేసుల విషయంలో జాగ్రత్తగా మెలగాలని, మర్యాద పూర్వకంగా ,సేవా భావంతో మెలగాలని సూచించారు. ఘటనా స్థలం నుంచి ఫోన్ రాగానే వేగంగా స్పందించాలన్నారు. ఆయన వెంట 108 అనకాపల్లి డివిజన్ ఓఈ నాగేశ్వరరావు, నర్సీపట్నం డివిజన్ ఓఈ సమాయేలు ఉన్నారు.

నేడు మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం తెల్లవారు నుంచి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. ఈ పూజల్లో పాల్గొనే భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

మాడుగుల రూరల్: మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమంలో భాగంగా రెండు పీహెచ్‌సీ పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో శనివారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. వీరితోపాటు గర్భిణులు, బాలింతలకు టీకాలు వేశారు. ఆయా గ్రామాల్లో ఆశ, ఆరోగ్య, అంగన్‌వాడీ, కార్యకర్తలు సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది పర్యవేక్షించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



గుల్లేపల్లిలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డి.ఎస్.ఎన్.రాజు

కె.కోటపాడు: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలంతా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. శనివారం గుల్లేపల్లిలో సీజనల్ వ్యాధులపై మహిళలకు ఆయన అవగాహన కల్పించారు. రోజూ పరిశుభ్రమైన ఆహారాన్ని వేడివేడిగా తీసుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణలో ఖాళీ టైర్లు, గోళాల్లో, కొబ్బరి బొండాల్లో నిల్వ నీటిని తొలగించుకోవాలన్నారు. వీటిల్లో ఎక్కువ రోజులపాటు నిల్వ నీరు ఉండడం వల్ల దోమలు లార్వా విడల్చడం వల్ల దోమల వృద్ధి చెందుతాయన్నారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ సోకకుండా ముందస్తుగా ప్రజలు జాగ్రత్తలను పాటించాలన్నారు.

5న ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం గౌరీగ్రంథాలయం ఆధ్వర్యంలో ఆగస్టు 5న విశాఖ జిల్లా అగనంపూడి హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధనా కేంద్రం సహకారంతో 'ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్' నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. ముఖ్య అతిథిగా పరిశోధనా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మహంతశెట్టి, విశిష్ట అతిథిగా ప్రివెంటివ్ అంకాలజీ, హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి హెచ్‌వోడీ డాక్టర్ జోల్ రోసా ఫెర్నాండేజ్ పాల్గొనున్నట్టు చెప్పారు. పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9247166511 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

వలంటీరు ఇంట్లో చోరీ

- 6 తులాల బంగారం, 5 తులాల వెండి వస్తువుల అపహరణ

యలమంచిలి: పట్టణంలోని పాత ఎస్‌బీఐ కాలనీలో వలంటీరు శ్యామకుమారి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం చోరీ చేశారు. పట్టణ ఎస్ఐ పాపినాయుడు వివరాల ప్రకారం... ఆమె తన కుటుంబ సభ్యులతో బంధువుల ఇంటికి వెళ్లింది. ఇదే అదనుగా చేసుకుని ఆమె ఇంట్లో బీరువాలో ఆరు తులాల బంగారం , ఐదు తులాల వెండి వస్తువులను ఎత్తుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి పట్టణ ఎస్ఐ క్లూస్‌టీంతో వెళ్లి ఇంట్లోను, పరిసరాలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నేడు

అనకాపల్లి టౌన్: స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో ఆదివారం సాయంత్రం జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్, అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మిస్టర్ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారావు, సేవా సంఘం వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో వంద మంది క్రీడాకారులు పాల్గొంటారని, ముందుగా వారి పేర్లు అసోసియేషన్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

దశపర్ణి కషాయంతో తెగుళ్ల నివారణ



లోపూడిలో దశపర్ణి కషాయం తయారు చేస్తున్న సిబ్బంది

బుచ్చెయ్యపేట: దశపర్ణి కషాయం వల్ల పంటలపై ఆశించిన తెగుళ్లను అరికట్టవచ్చని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి బి. కొండాజీ తెలిపారు. ఎన్.పి.ఎం షాపుల యజమానులకు, రైతులకు శనివారం లోపూడి, బంగారుమెట్ట, ఎల్.బి.పురం గ్రామాల్లో దశపర్ణి కషాయం తయారీ, వినియోగించే విధానంపై ఆయన అవగాహన కల్పించారు. వేప, జిల్లేడు, తూటికాడ, కానుగ, మారేడు, సీతాఫలం, ఆముదం, జామ, వావిలాకు తదితర పది రకాల ఆకులతో దశపర్ణి కషాయం తయారు చేస్తామన్నారు. ఒక్కో రకం ఆకు 2 కేజీలు, 2 కేజీలు పచ్చిమిర్చి, 2 కేజీలు వెల్లుల్లి, 2 కేజీలు పొగాకు, 200 గ్రాములు పసుపు, అరకేజీ అల్లంతో దంచి 20 లీటర్ల ఆవు మూత్రం, 2 కేజీల ఆవుపేడ, 150 లీటర్ల నీటిలో కలపాలన్నారు. ఈ విధంగా తయారు చేసిన కషాయాన్ని డ్రమ్ములో వేసి 41 రోజులు ఉదయం, సాయింత్రం సవ్య దిశలో తిప్పాలన్నారు. ఈ కషాయాన్ని వంద లీటర్లు నీటిలో 8 నుంచి 10 లీటర్ల చొప్పున ఎకరా పొలానికి పిచికారీ చేయాలని సూచించారు. రసాయన ఎరువులు వల్ల ప్రాణహాని ఉందని, ప్రకృతి విధానం వల్ల తెగుళ్ల నివారణతో పాటు ఆరోగ్యవంతమైన పంట పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పర్రె మాధవి, ఒడిగుండ నాగమణి, తమరాన రామకృష్ణ పాల్గొన్నారు.

విక్రయానికి సిద్ధంగా ఫల జాతి మొక్కలు

మాడుగుల రూరల్: అడపాదడపా కురుస్తున్న భారీ వర్షాలతో రైతులు తమ పొలాల్లో జీడి, మామిడి, కొబ్బరి, చీని నిమ్మ, మొక్కలు వేసుకోవాలని మండల ఉద్యానవన శాఖాధికారి వి. భాను పుష్పలీలావతి తెలిపారు. తాటిపర్తి, తదితర గ్రామాల్లో శనివారం ఆమె పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యానవన శాఖ ద్వారా కొత్త తోటల విస్తరణ పథకం ద్వారా సబ్సిడీపై జీడి, మామిడి, బ్యాగులో పెట్టి పెంచే కొబ్బరి, చీని నిమ్మ, నాణ్యమైన అంటు మొక్కలు అనకాపల్లి గుండా జంక్షన్ సమీపంలో జిల్లా ఉద్యానవన శాఖాధికారి కార్యాలయం ఆవరణలోని ఉద్యానవన క్షేత్రంలో విక్రయానికి అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ మొక్కలు కావాల్సిన రైతులు జీడిమామిడి మొక్క రూ.55, కొబ్బరి రూ.90, చీని నిమ్మ మొక్క రూ.25 ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. రైతులు ఉద్యాన క్షేత్రంలో నగదు చెల్లించి మొక్కలు పొందవచ్చునన్నారు. వాటి బిల్లులతోపాటు రైతు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డుతో రైతు భరోసా కేంద్రాల్లో వీహెచ్ఏ, లేదా వీఏఏలను సంప్రదించి ఎంత మేర భూమిలో మొక్కలు పెంచుతున్నారో అన్న వివరాలు అందించాలని సూచించారు. కొత్త పంట విస్తరణ పథకం కింద ప్రభుత్వం అందించే అన్ని రాయితీలు రైతులకు వరిస్తాయన్నారు.

రసాభాసగా సామాజిక తనిఖీ గ్రామ సభ



గ్రామ సభలో వాగ్వాదానికి దిగిన ఇరువర్గాల వారు

దేవరాపల్లి: గిరిజన పంచాయతీ వాలాబులో శనివారం నిర్వహించిన ఉపాధి సామాజిక తనిఖీ గ్రామ సభ రసాభాసగా మారింది. ఉపాధి పనుల్లో ఒకరికి బదులు మరొకరు వెళ్లారంటూ పరస్పర ఫిర్యాదులు చేసుకోవడంతో ఇరువర్గాల వాగ్వాదానికి దిగారు. గత వీఆర్పీ దొమ్మంగి భైరవనాయుడు మృతి చెందిన తర్వాత 2022–2023లో కూలీలను రెండు గ్రూపులకు విభజించి చెరువు పూడిక తీత పనులను మేట్లు పర్యవేక్షణలో చేయించారు. వీరిలో ఒక గ్రూపునకు సంబంధించి ఒకరికి బదులు మరొకరు వెళ్లారంటూ తొలుత కూలీలు ఫిర్యాదు చేశారు. దీనికి ఒక్క గ్రూపునకు చెందిన కొందరు ఒప్పుకున్నారు. మరొక గ్రూపులో కూలీలందరూ స్వయంగా వచ్చి పనులు చేసినప్పటికి ప్రతిపక్ష టీడీపీకి చెందిన కొందరు వీరిపైనా ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించడంతో వివాదం తలెత్తింది. వీరి తీరుపై వైఎస్సార్‌సీపీ వర్గీయులు అభ్యంతరం చెప్పడంతో ఈ వివాదం తోపులాటకు దారి తీసింది. సభలో ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో పంచాయతీ సెక్రటరీ బి. శ్రీనివాసరావు, సామాజిక తనిఖీ డీఆర్పీ వి. వెంకటేష్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ డి. ప్రసాద్ అర్ధాంతరంగా సభ నిలిపివేశారు. ఈ ఏడాది జనవరిలో ఫీల్డ్ అసిస్టెంట్ (వీఆర్పీ)గా బాధ్యతలు స్వీకరించిన బి. విజయలక్ష్మి గతేడాది చేసిన పనులు విషయం తనకు తెలియదని స్పష్టం చేశారు. సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోడెల నానిబాబు పాల్గొన్నారు.

'మై గవర్నమెంటు క్విజ్'లో రాంబాబు ఘనత



అప్పన రాంబాబు

రోలుగుంట : ప్రభుత్వం నిర్వహించిన 'మై గవర్నమెంటు క్విజ్'' అన్‌లైన్ పోటీలో కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ అప్పన రాంబాబు మాస్టారు పాల్గొని లక్ష పాయింట్లు సాధించి చాంపియన్‌తో పాటు చేంజ్ మేకర్ హోదా దక్కించుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'మై గవర్నమెంటు క్విజ్'' పోటీల్లో ఆయన 53 క్విజ్ పోటీల్లో పాల్గొని 53 ధ్రువ పత్రాలు పొందారు. ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రభుత్వ పథకాలు, పర్యావరణ అంశాలు, ప్రముఖ దినోత్సవాలు, స్వచ్ఛ భారత్,జి20ల మీద వచ్చిన ప్రశ్నలకు సరైన సమాధానాలిచ్చి మంచి స్కోరు 1.04.000 పాయింట్లకు చేరుకొని చాంపియన్‌గా నిలిచారు. చేంజ్ మేకర్ హోదా దక్కించుకున్నారు. తద్వారా తమ పాఠశాలకు గుర్తింపు రావడంపై హెచ్ఎం శెట్టి మోహన్‌రావు, ఉపాధ్యాయులు రాంబాబు మాస్టారును అభినందించారు.